సాక్షి
తిరుపతి
మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.58,720
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,245

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,300
రిటైల్ వెండి గ్రాము	రూ.70.30

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	18
చిత్తూరు	34	17
తిరుమల	30	14
గూడూరు	34	19
నగరి	35	19



అంకురార్పణ


శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాత్రి సప్తమాతృకలకు అర్చకులు పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ పలికారు.

న్యూస్‌రీల్

ఓటర్ల జాబితా పరిశీలన 16 నాటికి పూర్తి


డీఆర్‌ఓ శ్రీనివాసరావు

తిరుపతి అర్బన్: ఓటర్ల జాబితా పరిశీలనను ఈనెల 16వ తేదీ నాటికి పూర్తిచేస్తామని డీఆర్‌ఓ శ్రీనివాసరావు వెల్లడించారు. సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి డీఆర్‌ఓ హాజరై వివరాలు తెలియజేశారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీతో సమావేశం నిర్వహించామన్నారు. 23వ తేదికి ఓటర్ల తుది జాబితా సిద్ధం చేస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు, అనుబంధ పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధమైందని వెల్లడించారు. మంగళవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు ఆర్‌ఓకు జాబితా సమర్పించనున్నామని చెప్పారు. ప్రస్తుతం 639 దరఖాస్తులు పరిశీలన చేయాల్సి ఉందని, గడువులోపు పూర్తిచేస్తామని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో ఏఓ సుబ్రమణ్యం, ఎన్నికల తహసీల్దార్ పరమేశ్వరస్వామి పాల్గొన్నారు.


అష్టదిక్పాలకులకు ఆహ్వానం పలుకుతూ..

ముక్తిధామం.. మహోతేజం


ధ్వజారోహణానంతరం కర్పూర హారతి సమర్పిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ధ్వజస్తంభానికి పవిత్ర వస్త్రం అలంకరిస్తున్న అర్చకులు, పల్లకిపై భక్త కన్నప్ప

- శ్రీకాహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- కనులపండువగా కన్నప్ప ధ్వజారోహణం
- నేడు దేవరాత్రికి సర్వం సిద్ధం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)/శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భక్తునికే ప్రథమ పూజ దక్కింది. కన్నప్ప ధ్వజారోహణంతో సోమవారం మహాశివరాత్రి వేడుక మొదలైంది. ముక్కంటి సన్నిధి సకల దేవతలకు కొలువైంది. బోయ వంశస్తులకే ఉభయదారులుగా వ్యవహరించే మహద్భాగ్యం వరించింది. ఆదిదంపతులకు స్వాగతం పలుకుతూ కైలాసగిరిని ఆలయాధికారులు శోభాయమానంగా అలంకరించారు. మేళతాళాల నడుమ భక్త కన్నప్పతో స్వామి, అమ్మవార్లను కొండపైకి వేంచేపు చేశారు. వేదపండితులు ముందుగా ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పవిత్ర వస్త్రంతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుని దేవదేవుని కటాక్షం పొందారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు పాల్గొన్నారు.

నేడు స్వామివారి ధ్వజారోహణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగామంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామివారి ధ్వజారోహణం (దేవరాత్రి) నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఉదయం, సాయంత్రం వెండి అంబారీలపై స్వామి, అమ్మవార్లు ఊరేగనున్నారు.

అష్టదిక్పాలకులకు ఆహ్వానం

కన్నప్ప ధ్వజారోహణానంతరం అష్టదిక్పాలకులను ఆహ్వానించారు. కైలాసగిరిపై ఓ ప్రత్యేక ప్రాంతం నుంచి మంత్రోచ్ఛారణ నడుమ బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని పిలుపునిచ్చారు.

బతుకు పుల్లకింత

హిందూ ధర్మంలో యజ్ఞయాగాదులకు విశిష్ట స్థానం ఉంది. ముఖ్యంగా శుభకార్యాల్లో హోమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో సమిధలుగా తొమ్మిది రకాల పుల్లలు, గోమయంతో తయారుచేసిన పిడకను వినియోగించడం సంప్రదాయం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ ప్రత్యేక సామగ్రిని సేకరించి పలువురు ఉపాధి పొందుతున్నారు. అత్యంత నియమనిష్టలతో పవిత్ర హోమ సమిధలను సమీకరిస్తున్నారు. యాగ క్రతువులో సమర్పించే విశేష ద్రవ్యాలను విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు.

- హోమ సమిధల సేకరణతో ఉపాధి
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలుచోట్ల విక్రయాలు
- మలేషియాకు సైతం ఎగుమతి



నవగ్రహ పుల్లలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) హోమం నిర్వహిస్తున్న వేదపండితుడు (ఫైల్)

సాక్షి నెట్‌వర్క్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. ప్రధానంగా తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురం, తలకోన, నారాయణవనం, నాగలాపురం, బంగారుపాళ్యం, సురుటుపల్లె, గుడిమల్లంలో ప్రముఖ ఆలయాలు కొలువై ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ప్రత్యేక హోమాలు జరిపించుకునేవాళ్లు అధికంగా ఉంటారు. ఈక్రమంలోనే విశేష హోమ పూజల్లో సంప్రదాయంగా వినియోగించే సమిధల విక్రయాలకు కూడా జిల్లా ప్రసిద్ధి చెందింది.

డిమాండ్ అధికం

ఆలయ కుంభాభిషేకాల నుంచి వివాహాలు, గృహప్రవేశాలు తదితర శుభకార్యాల్లో ప్రత్యేకంగా హోమాలు జరిపిస్తుంటారు. అందులో మోదుగ, రాగి, తెల్లజిల్లేడు, అత్తి, జమ్మి, ఉత్తరేణి, చంద్ర, గరిక, దర్భలతోపాటు గోవు పేడతో చేసిన పిడకలను సమిధలు సమర్పిస్తుంటారు. మరికొందరు వీటితోపాటు తిప్పతీగ, మర్రి చిగుర్లు, వేప పుల్లలను సైతం వాడుతుంటారు. ఈ సామగ్రికి డిమాండ్ కూడా అధికంగా ఉంది. అయితే ఈ సమిధల సేకరణ కష్టతరంగా మారుతుండడంతో కొందరు అరకొర సామగ్రినే విక్రయించేస్తున్నారు. హోమం విశిష్టత, విధానం తెలిసిన వారు మాత్రం మొత్తం తొమ్మిది రకాల పుల్లలు, పిడక కావాల్సిందే అని పట్టుబడుతుంటారు. ప్రస్తుతం మోదుగ, తెల్ల జిల్లేడు, జమ్మి, చంద్ర పుల్లలు విరివిగా దొరకడం లేదని పలువురు వ్యాపారులు తెలియజేస్తున్నారు. శ్రీకాళహస్తి, చెల్లూరు, కార్వేటినగరం, చంద్రగిరి, పచ్చికాపల్లం, కేవీబీ పురం పరిసర ప్రాంతాల్లో మాత్రమే కొద్దోగొప్పో లభిస్తున్నట్లు వెల్లడిస్తున్నారు.

సంప్రదాయంతో ఉపాధి!

సంప్రదాయంగా నిర్వహించే హోమాలకు అవసరమైన సామగ్రి అందిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు. నగరిలో రవిచంద్రాచ్చారి, తిరుపతిలో మణియాదవ్, శ్రీకాళహస్తి సమీపంలోని చుక్కలనిడిగల్లు, లింగమనాయుడుపల్లె, మీఎంపల్లి, పుల్లూరు, బొక్కసంపాలెం, కాగితాల హరిజనవాడకు చెందిన కొందరు యజ్ఞ సమిధల సేకరించి విక్రయిస్తున్నారు. నగరిలో మాత్రం రవిచంద్రాచ్చారి చిన్న కుటీర పరిశ్రమగా మార్చి మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. అలాగే నగరి పట్టణం ఆదంకాలనీ ఎక్స్‌టెన్షన్ వీధికి చెందిన పలువురు పుల్లల సేకరణను జీవనోపాధిగా మార్చుకున్నారు. వీరంతా హోమానికి అసరమైన వాటిని తీసుకువచ్చి ఎండబెట్టి చిన్న చిన్నవి (జానెడు సైజు)గా కత్తిరించి సిద్ధం చేసుకుంటారు. అనంతరం వాటిని ప్యాకెట్లుగా పార్సిల్ చేసి తమిళనాడులోని వేలూరు, కాంచీపురం, చెన్నై, మధురై, కుంభకోణం తదితర నగరాలకు సరఫరా చేస్తున్నారు. శ్రీకాళహస్తి పరిసర గ్రామాల వారు సేకరిస్తున్న పుల్లలను ఆలయాలకే విక్రయిస్తున్నారు. నగరి నుంచి వెళ్లే హోమ పుల్లలు, ఆవు పిడకలకు మలేషియాలో అధిక డిమాండ్ ఉంది.


తిరుపతి పూల మార్కెట్ వద్ద విక్రయానికి సిద్ధంగా హోమ సమిధలు


తిరుపతి లో యాదవ్ నివాసం వద్ద హోమ పుల్లలు


ప్యాకింగ్‌కు ముందు ఎండబెడుతూ..

సంతృప్తిగా ఉంది



దశాబ్దానికి పైగా ఈ వ్యాపారం చేస్తున్నాం. పదిమందికి ఉపాధి కల్పించడంతో సంతృప్తిగా ఉంది. హోమ పుల్లలకు మంచి డిమాండ్ ఉంది. చెన్నై, వేలూరు, కంచి నుంచి వస్తున్న ఆర్డర్ల మేరకు పుల్లలు సరఫరా చేస్తున్నాం. సమిధల సేకరణ చాలా కష్టం. 20 రోజులపాటు పదిమంది పనిచేస్తే ఒక లోడు సిద్ధం అవుతుంది.

– రవిచంద్రాచ్చారి, నగరి

అగ్ని ఆరాధన ప్రత్యేకం



జీవన విధానంలో 'అగ్ని ఆరాధన' చాలా ప్రత్యేకం. వైదిక పరంపరను అనుసరించి హోమ క్రతువును పలు విధాలుగా ఆచరిస్తున్నారు. హోమాల్లో వాడే సమిధలు విశిష్టమైనవి. తెల్లజిల్లేడును హోమంలో వేయడం వచ్చే పొగ వాతం, కఫం, తలనొప్పి, కోపం, కుష్టు, నేత్ర సంబంధిత వ్యాధులను హరిస్తుంది. మోదుగ వల్ల మానసిక సమస్యలు నయమవుతాయి. చంద్ర వల్ల ఎర్రరక్త కణాలు, రక్తహీనత, ఉక్రోషం వంటివి సమసిపోతాయి. ఉత్తరేణి వల్ల చర్మ, జీర్ణ సంబంధిత వ్యాధులు దూరమవుతాయి. రావి వల్ల సంతాన, కఫ దోషాలతో పాటు జ్ఞానం లభిస్తుంది. అత్తి వల్ల వివాహ సమస్యలు, మధుమేహ నుంచి ఉపశమనం లభిస్తుంది. జమ్మి వల్ల అపమృత్యుభయం, అనారోగ్య సమస్యలను తొలగుతుంది. గరిక వల్ల నరదృష్టి నివారణ, సర్పదోషం, చర్మ దోషానికి నివారణ. దర్భ వల్ల కాల సర్ప దోషం, మూర్ఛ రోగం నుంచి ఉపశమనం లభిస్తుంది.

– సాయిరాం పరాంకుశం, అర్చకుడు, తిరుచానూరు

అన్నీ అవసరమే



మా కుటుంబం 20 ఏళ్లుగా హోమం పుల్లలను విక్రయాలు చేస్తోంది. వీటిని నవగ్రహ పుల్లలు అంటారు. హోమానికి ఇవి అన్నీ అవసరమే. మాకు ఆర్డర్లు వస్తాయి. నాకు కాళ్లు లేకపోయినా కూలీల ద్వారా పుల్లలు సేకరించి, కట్ట కట్టి నిల్వ చేస్తాం. వ్యాపారులు వచ్చి తీసుకెళ్తుంటారు. ఒక కట్టలో 28 పుల్లలు ఉంచుతాం. ఒక కట్ట రూ.200. నెల రోజుల పాటు కష్టపడి సేకరిస్తే 50 కట్టలు అవుతాయి.

– మేశం మణియాదవ్, తిరుపతి

స్పందన అర్జీలకు సమయం కేటాయించండి

- కలెక్టర్ వెంకటరమణారెడ్డి


స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలను పరిష్కరించడానికి ప్రతి అధికారి కొంత సమయం కేటాయించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, స్పెషల్ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు హాజరయ్యారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీదారులతో మాట్లాడి వారి అర్జీలను అధికారులు స్వీకరించారు. సమస్యలను నేరుగా పలువురు కలెక్టర్ వెంకటరమణారెడ్డికే వివరించారు. పలు సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి సమస్యలకు మార్గాలు చూపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విభాగానికి చెందిన జిల్లా అధికారి స్పందనకు హాజరు కావాలని చెప్పారు. స్పందనలో వచ్చే అర్జీలను సీరియస్‌గా తీసుకుని వాటిని పరిష్కరించాలని వివరించారు. అధికంగా రెవెన్యూ సమస్యలే వస్తున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేతో రెవెన్యూ సమస్యలు తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా సోమవారం స్పందనకు మొత్తం 132 అర్జీలు వచ్చాయి.

మౌలిక వసతులకు తొలి ప్రాధాన్యం


సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : జాతీయ మానవహక్కుల కమిషన్ సూచనల మేరకు గూడూరు, సూళ్లూరుపేట డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై నివేదిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. నిర్మించిన రోడ్లు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు, చెరువుల్లో పూడిక తీత పనులు, త్రీ ఫేస్ ఎలక్ట్రిక్ లైన్ ఏర్పాటు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం తదితరాలపై అంచనాలు రూపొందించాలని సూచించారు. సమావేశంలో గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో బిజీ..బిజీ

- ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్


ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించడంతో ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు స్వీకరించనున్నట్లు వెల్లడించింది. మార్చి 13న ఎన్నికలు, 16న కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరినారాయణన్, స్థానిక సంస్థల ఆర్‌ఓ జేసీ వెంకటేశ్వర్ చిత్తూరులోని కౌంటింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు.

పకడ్బందీగా పర్యవేక్షణ..

ఎన్నికల విధులకు అవసరమైన సిబ్బంది, బాధ్యతలు అప్పగింతపై కలెక్టర్, జేసీ నిర్ణయం తీసుకోనున్నారు. ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల నుంచి పోటీ చేసే అభ్యర్థులు చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్‌లు దాఖలు చేయాల్సి ఉంటుంది. గ్రాడ్యుయేట్, టీచర్ నామినేషన్‌లను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హరినారాయణన్ కలెక్టర్ చాంబర్‌లో, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్లను కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆర్వోగా వ్యవహరించే జేసీ వెంకటేశ్వర్ స్వీకరిస్తారు. ఈ కసరత్తులో భాగంగా సోమవారం సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ రూట్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్ ఉత్తర్వులు జారీచేశారు.

క్లుప్తంగా

రైల్లో నుంచి పడి అస్సాం వాసి మృతి



రైలు పట్టాల పక్కన పడి ఉన్న అస్సాం వాసి మృతదేహం

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో రైలు పట్టాల వద్ద అస్సాం వాసి మృతదేహం పడి ఉంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. గౌహతి నుంచి చెన్నైకు వెళ్లే ఎక్స్‌ప్రెక్స్ రైల్లో నుంచి సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని పండ్లూరు వద్ద రైల్వే కీమెన్ శ్రీనివాసులు గుర్తించి గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్‌ఐ కొండపనాయుడు, రైటర్ జయప్రకాష్ ఘటనా స్థలికి చేరుకుని కదులుతున్న రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారి పడి అతను మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతుని జేబులో దొరికిన రైల్వే టికెట్ ఆధారంగా అస్సాం వాసిగా పోలీసులు గుర్తించారు. జేబులో దొరికిన సెల్‌ఫోన్ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యుడి దారుణ హత్య

- కలపాడు తెలుగుగంగ కాలువ బ్రిడ్జి వద్ద ఘటన
- గూడూరు డీఎస్పీ ఆధ్వర్యంలో మూడు బృందాలతో దర్యాప్తు



షేక్ సందానీబాషా (ఫైల్)

వెంకటగిరి: పట్టణంలోని మాసాపేటకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు షేక్ సందానీ బాషా (46)ను గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి కథనం మేరకు.. వెంకటగిరికి చెందిన సందానీబాషా గత 18 ఏళ్లుగా డక్కిలి మండలం మోపూరుక్రాస్ రోడ్డులో ఆర్‌ఎంపీగా వైద్యసేవలు అందిస్తున్నాడు. రోజూ వారీలాగానే ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో క్లినిక్ మూసేసి మోటారుసైకిల్‌పై అదేప్రాంతానికి చెందిన వాటర్ సర్వీస్‌సెంటర్‌లో పనిచేసే మరో వ్యక్తితో కలిసి వెంకటగిరికి బయలుదేరాడు. స్థానిక కలపాడు బ్రిడ్జి వద్దకు రాగానే ముగ్గురు గుర్తుతెలియని దుండగులు సందానీబాషాపై కత్తులతో దాడి చేసి పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో వైద్యుడి వెంట వచ్చిన మరో వ్యక్తి భీతిల్లి సంఘటనాస్థలం నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు వెంకటగిరి సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ జిలానీబాషా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునితోపాటు మోటారుసైకిల్‌పై వచ్చిన మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



సందానీబాషా హత్య జరిగిన ప్రాంతంలో క్లూస్‌టీం పరిశీలన (ఇన్‌సెట్) ఘటనా స్థలంలో ఆర్‌ఎంపీ వైద్యుడు సందానీబాషా మృతదేహం

అనుమానితుల సెల్‌ఫోన్ కాల్‌లిస్టు ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. హత్యకేసును ఛేదించేందుకు మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేయిస్తున్నామని, వీలైనంత త్వరగా నిందితులను గుర్తిస్తామని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలియజేశారు.

డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో పరిశీలన..

ఆర్‌ఎంపీ వైద్యుడి హత్య కేసును ఛేదించేందుకు పోలీసులు తిరుపతి నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి ఆధారాలు సేకరించారు. పోలీస్ జాగిలం తెలుగుగంగ కాలువ గట్టుపై సుమారు 1 కి.మీ వెళ్లి ఆగింది. అలాగే మోపూరు క్రాస్‌రోడ్డుతో పాటు మరికొన్ని చోట్ల సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వివాద రహితుడు, సేవా భావం కలిగిన వ్యక్తిగా పేరున్న సందానీబాషా హత్యకు గురైన విషయం తెలిసి పలువురు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మోపూరు క్రాస్‌రోడ్డులో స్థానికులను విచారిస్తున్న గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

సంప్రదాయ శిల్పకళాపోషణకు కృషి

- టీటీడీ శిల్పకళాశాలలో మూడు రోజుల శిల్పకళా ప్రదర్శన
- అమ్మకాలను ప్రారంభించిన ఈఓ ఏవీ ధర్మారెడ్డి



శిల్పకళాశాలలో ప్రదర్శనలను పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి తదితరులు

తిరుపతి అలిపిరి: శిల్పకళ, సంప్రదాయ సంగీత, నృత్య కళలను పోషించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం కృషిచేస్తోందని ఈఓ ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. టీటీడీ శిల్ప కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించే శిల్పకళా ప్రదర్శన, అమ్మకాలను సోమవారం ఆయన ప్రారంభించారు. శిల్పకళాశాల విద్యార్థులు తయారుచేసిన ఆలయ నిర్మాణం, శిల్ప, సుధా, దారు, లోహ శిల్పాలు, సంప్రదాయ వర్ణ చిత్రాలు, కలంకారీ చిత్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఈఓ మాట్లాడుతూ టీటీడీ అనేక హిందూ ధార్మిక కార్యక్రమాలతో పాటు, సాంఘిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా 30కి పైగా పాఠశాలలు, ఆస్పత్రులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిల్పకళలో నైపుణ్యం సంపాదించిన వారికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. టీటీడీ శిల్పకళాశాల నుంచి వెళ్లిన అనేక మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో మంచిస్థాయిలో ఉన్నారని తెలిపారు. విద్యార్థులు శిల్పకళలో ప్రావీణ్యం సాధించి, శిల్పకళను బతికించాలని పిలుపునిచ్చారు. శిల్ప కళాశాలలో కలంకారీ కోర్సులో చేరే విద్యార్థులకు కూడా అడ్మిషన్ సమయంలో రూ.లక్ష డిపాజిట్ చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. శిల్ప కళాశాల నిర్వహణ, పరిసరాల వాతావరణం చక్కగా ఉందని అధ్యాపకులను, విద్యార్థులను ఆయన అభినందిచారు. జేఈఓ సదాభార్గవి, డీఈఓ భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డితో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఈనెల 15వ తేదీ వరకు రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిల్ప కళా ప్రదర్శన, అమ్మకాలు జరుగుతాయి.

కల్యాణ వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

నారాయణవనం/వడమాలపేట: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ దంపతులు సోమవారం సాయంత్రం నారాయణవనంలోని పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనను ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి, పద్మావతీ అమ్మవార్లను దర్శించుకున్న ఆయనకు ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అందజేశారు. తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి రవిబాబు, పుత్తూరు జడ్జి వేణుగోపాల్ స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా సోమవారం రాత్రి వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.



ఆలయ మర్యాదలను అందుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్

అధిక ధరకు కల్యాణోత్సవం టికెట్ల విక్రయం

– తిరుమలలో దళారీపై కేసు నమోదు

తిరుమల : శ్రీవారి కల్యాణోత్సవం టికెట్లను అధిక ధరకు విక్రయించిన దళారీపై తిరుమల టూటౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. శ్రీవారి కల్యాణోత్సవం టికెట్లు ఇప్పించాలని బెంగళూరుకు చెందిన పవన్ కుమార్ తిరుపతికి చెందిన దళారి డి.సురేష్‌ను సంప్రదించాడు. సురేష్ తనకు తెలిసిన టీటీడీ ఉద్యోగి టీవీ నాగభూషణం సిఫారసు లేఖ ద్వారా రెండు కల్యాణోత్సవం టికెట్లు పొందాడు. వాటిని భక్తులకు రూ.28,500కు విక్రయించాడు. తాము మోసపోయామని గుర్తించిన భక్తులు టీటీడీ విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో ఎస్.పద్మనాభన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన భక్తులతో తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అర్చకుడి ఇంట్లో చోరీ

చంద్రగిరి : స్థానిక రాములవారిగుడి వీధిలోని ఓ అర్చకుడి ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు.. శ్రీకోదండరామాలయంలో ప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్న కృష్ణ భట్టార్ ఈనెల 8న బెంగళూరు వెళ్లారు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి తిరిగి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూజ్ టీమ్ అధికారులతో అక్కడికి చేరుకుని పరిశీలించారు. బీరువాలోని బ్రాస్‌లైట్, నవరత్నాల చైను, ఐదు బంగారు ఉంగరాలు, రూ.30 వేల నగదు చోరీ చేసినట్టు బాధితులు తెలిపారు. అదే విధంగా కోట గ్రామంలోని సులేమాన్ ఇంటి వద్ద ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచానూరులో...

తిరుచానూరు శ్రీవెంకట పద్మావతి కాలనీలో చోరీ జరిగింది. శ్రీవెంకటపద్మావతి కాలనీకి చెందిన నరేష్ తన కుటుంబ సభ్యులతో కలసి రెండు రోజుల క్రితం తిరువణ్ణామలై ఆలయానికి వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తాళాలు, తలుపులు బద్దలకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, క్లూజ్ టీం అధికారులు ఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం వేలిముద్రలను సేకరించారు. రెండు బంగారు చైన్లు, ఒక బ్రాస్‌లైట్ చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణభట్టార్ ఇంట్లో వేలి ముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం అధికారులు



నరేష్ ఇంట్లోని బీరువాలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

వీరస్వామినగర్‌లో పట్టపగలే చోరీ

వరదయ్యపాళెం: పట్టపగలే ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని వీరస్వామినగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంగన్‌వాడీ టీచర్‌గా ఉన్న అరుణ, సునీల్ దంపతులు వీరస్వామినగర్‌లోని తన తండ్రి రమణయ్య ఇంటి సమీపంలో నివాసమున్నారు. సోమవారం అరుణ అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లగా, భర్త సునీల్ తన మామ రమణయ్యను కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి తీసుకునివెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దుండగులు మధ్యాహ్నం సమయంలో తాళం వేసి ఉన్న తలుపులను విరిచి లోపలికి చొరబడ్డారు. లోపల ఉన్న బీరువాను పగులగొట్టి లోపల ఉన్న 20 సవర్ల బంగారు అభరణాలు, రూ.2లక్షల నగదును దోచుకున్నారు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ షణ్ముగం, సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం సాయంత్రం వేలిముద్రల నిపుణులను రంగంలోకి దింపి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.



చోరీ జరిగిన ఇంటిలో పోలీసుల తనిఖీలు

జిల్లా కేంద్రంలో ప్రీమియం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



పీవీఎస్ బాబు, జిల్లా రిజిస్ట్రార్

తిరుపతి అర్బన్: ఆస్తుల క్రయవిక్రయదారులు సులభంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడంతోపాటు కార్యాలయంలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి జిల్లా కేంద్రంలో ప్రీమియం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఏరోజు రిజిస్ట్రేషన్ చేసుకుంటే అదేరోజు డాక్యుమెంట్లు క్రయవిక్రయదారులకు అందజేస్తారని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయని తెలిపారు. తిరుపతిలోని తుడా కార్యాలయం ఎదురుగా ఉన్న పాత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. అదనంగా తిరుపతి కేంద్రంలోనే మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కొత్త కార్యాలయానికి 7వేల నుంచి 10వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో పాటు విశాలమైన పార్కింగ్ స్థలం ఉన్న భవనం అద్దెకు తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు 9949940593 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అమ్మవారి సేవలో మణిందర్‌జీత్ సింగ్ బిట్టా



ఆలయంలో కుటుంబ సభ్యులతో మణిందర్‌జీత్ సింగ్ బిట్టా

తిరుచానూరు(చంద్రగిరి): ఆల్ ఇండియా యాంటీ టెర్రరిస్ట్ ఫ్రంట్ చైర్మన్ మణిందర్‌జీత్ సింగ్ బిట్టా సోమవారం రాత్రి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, వీఐ రామ్మోహన్, ఎస్‌ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సారాపై ఉక్కు పాదం



మాట్లాడుతున్న తిరుపతి యూనిట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజేంద్ర

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లాలో సారాపై ఉక్కుపాదం మోపాలని తిరుపతి యూనిట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజేంద్ర తెలిపారు. సోమవారం పోలీస్ అతిథి గృహంలో జిల్లా క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటుచేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పరివర్తన కార్యక్రమంలో కొనసాగింపుగా ప్రత్యామ్నాయ జీవనభృతి కల్పించాలని ఆదేశించారు. జీవనభృతి కల్పించడానికి తగిన వ్యక్తులను గుర్తించాల్సిందిగా ఆదేశించారు. ఇందులో భాగంగా మహిళా సంక్షేమ కార్యదర్శి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్వాతి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.